
సాక్షి
ఒడిశా
సోమవారం । 19 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 1,23,507 బంగారం 110 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సీఎం రుణం తీర్చుకునే సమయమొచ్చింది

- IIలో



గోపబంధు దాస్‌కు నివాళులు

- IIలో

న్యూస్‌రీల్

రాష్ట్రపతిని కలిసిన బోండ గిరిజనులు



గిరిజనులకు అభివాదం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోడ ఘాటీపై ఉన్న బోండ గిరిజనులు ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసుకొని, ఆదివారం జిల్లాకు చేరుకున్నారు. బయట ప్రపంచం తెలియని ఈ తెగకు చెందిన గిరిజనులకు రాష్ట్రపతి నుంచి పిలుపు రావడంతో, 17 మంది గిరిజనులను గిరిజన మంత్రిత్వ శాఖ నేతృత్వంలో ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ కుమార్ సాహు ఢిల్లీ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారితో రాష్ట్రపతి మాట్లాడారు. రానున్న రోజుల్లో వారు నివసిస్తున్న ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. అనంతరం గిరిజనులు ఢిల్లీలో ఉన్న ప్రధాన పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. తమకు అవకాశం రావడంపై ఆనందం వ్యక్తం చేశారు.

నీలగిరి ఎమ్మెల్యే సుకాంత్ నాయక్‌కు అస్వస్థత



చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే సుకాంత్ నాయక్

భువనేశ్వర్: బాలేశ్వర్ జిల్లా నీలగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే సుకాంత్ నాయక్ అస్వస్థతకు గురయ్యారు. శనివారం సాయంత్రం ఆయన ఆరోగ్యం అకస్మాత్తుగా క్షీణించింది. దీంతో ఆయనకు బాలేశ్వర్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చేర్పించారు. విపరీతమైన వేడి కారణంగా అధిక రక్తపోటుతో అస్వస్థతకు గురైనట్లు వైద్యులు వెల్లడించారు. చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం మెరుగుపడింది. బాలేశ్వర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం నీలగిరి సబ్ డివిజన్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు.

గంజాయి పట్టివేత



పోలీసులకు పట్టుబడిన గంజాయితో పాటు బైక్

జయపురం: సదర్ పోలీసులు 70 కేజీల గంజాయి పట్టుకున్నట్లు పోలీసుస్టేషన్ అధికారి ఈశ్వర తండి తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాత్రి సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన టొప్పె నేతృత్వంలో పోలీసులు విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారి పాత్రోపుట్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించారు. దీనిలో భాగంగా రాత్రి 11.30 గంటల సమయంలో ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై కొన్ని సామానులు తీసుకొస్తూ, పోలీసులు చూసి బైక్‌తో సహా సామాన్లు విడిచి అడవిలోకి పారిపోయాడు. పోలీసులు బైక్‌పై ఉన్న బస్తాలను తనిఖీ చేయగా వాటిలో గంజాయి బయట పడింది. పోలీసులు గంజాయితో పాటు బైక్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చారు. పట్టుబడిన గంజాయి 70 కేజీలు ఉంది. దీని విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని ఈశ్వర తండి వెల్లడించారు. ఘటనపై ఒక కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

గంజాం జిల్లాకు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా

బరంపురం: గంజాం జిల్లా మరోసారి జాతీయ పురస్కారానికి ఎన్నికైంది. 2022కు సంబంధించి జల శక్తి, నదుల అభివృద్ధి, గంగా సంరక్షణ విభాగంలో ఎంపికైంది. శనివారం సాయంత్రం న్యూఢిల్లీలో ఉప రాష్ట్రపతి జగదీప్ దన్‌కర్ చేతుల మీదుగా గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో గంజాం జిల్లా పరిషత్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.కీర్తి వాసన్ పాల్గొన్నారు.



సింహద్వారం వాకిలిలో ఆకర్షణీయమైన సువిశాల రంగవల్లి



సుందరంగా తీర్చిదిద్దిన రథ చక్రాలు

వస్తున్నాయ్.. వస్తున్నాయ్

జగన్నాథ రథ చక్రాల్

- రేపే జగన్నాథుని రథయాత్ర
- రథాలకు తుది మెరుగులు
- నేడు మందిరం సింహద్వారం వద్దకు 3 రథాలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు

భువనేశ్వర్: పూరి జగన్నాథుని రథయాత్రకు సర్వం సిద్ధమైంది. ఆరోగ్యంతో కోలుకున్న స్వామివారు శ్రీమందిరంలో నయన అలంకరణ రంగరించుకుని నేత్రోత్సవానికి సిద్ధమయ్యాడు. బయట స్వామివారి రాక కోసం రథాలు తుది మెరుగులు దిద్దుకుని సింహద్వారం ఆవరణ చేరేందుకు వడివడిగా ముస్తాబవుతున్నాయి. స్వామితో యాత్రలో పాల్గొనేందుకు పార్శ్వ దేవతలు రథం ఇరువైపులా కొలువుదీరారు. చిత్రకార్ సేవకులు రథాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారు. రథాలను కూడా గూస్ కవచంతో అలంకరించారు. చిత్రకారుడు రూపకార్, సేవాయత్ వర్గాలు రథాలకు అమర్చిన పార్శ్వ దేవతలు, రథ సారథుల కొయ్య బొమ్మల్లో జీవకళని ప్రతిబింబించడంలో నిమగ్నమై ఉన్నారు. సోమవారం నాటికి 3 రథాలను శ్రీమందిరం సింహ ద్వారం ఆవరణకు తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన శ్రమిస్తున్నారు. సువిశాల రంగవల్లులతో సింహద్వారం వాకిలి రథాల ఆగమనం కోసం నిరీక్షిస్తుంది.

రథ కలశం అమరిక

రథ శిఖరంపై కొయ్య కలశం ఏర్పాటు చేశారు. దీనికి ఇరువైపుల తలకిందులుగా రెండు పచ్చని చిలుకలు (కొయ్య తయారీ) బిగించారు. అనంతరం దీనిపై ఇత్తడి కలశం, జెండాలు తదితర వాటిని అనుసంధానం చేస్తారు. మహరణా వర్గం సేవకుల ప్రత్యక్ష పర్యవేక్షణలో, మూడు రథాల సేవకులు వీటిని అమర్చారు. వీటి అమరికలో నాలుగున్నర అడుగుల కలశ మేకులు, నరాజ్ మేకులను వినియోగించారు. మూడు తరాలకు ద్వార బంధాల అమరిక పూర్తి చేశారు. 3 రథాల ప్రభ రంగుల పనులు పూర్తిచేసి అమరిక చకచకా పూర్తి చేస్తున్నారు. రథాల వస్త్ర అలంకరణ పనుల్లో దర్జీ సేవకులు నిర్విరామంగా శ్రమిస్తున్నారు.



పచ్చని చిలుక జంటతో శిఖరంపై కొయ్య కలశంతో సిద్ధమైన రథాలు

కన్యా పట్టాలు

రథాల తయారీలో పలు భాగాల అమరికలో చోటు చేసుకున్న ఖాళీలు నింపేందుకు ప్రత్యేక కలప చెక్కలు వినియోగిస్తారు. వీటిని కన్యా పట్టాలుగా పేర్కొంటారు. శనివారం ఈ పనులు ప్రారంభించారు. శ్రీజగన్నాథుని నందిఘోష్ మరియు బలభద్రుని తాళ ధ్వజం రథాలకు 12 చొప్పున, దేవీ సుభద్ర దర్ప దళన రథం పనుల్లో 8 కన్యా పట్టాలు వినియోగించారు. ఇలా 3 రథాలకు సమగ్రంగా 32 కన్యా పట్టాలు అవసరమయ్యాయి.



సిద్ధమైన రథ సారథులు



రథాల కోసం సిద్ధమైన కొయ్య గుర్రాలు

సమయపాలన తప్పనిసరి

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్ర సేవాదుల్లో సమయపాలన తప్పనిసరి అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. శనివారం రాత్రి ఆయన పూరీ సందర్శించి యాత్ర సన్నాహాలు ప్రత్యక్షంగా సమీక్షించారు. నేత్రోత్సవం నుంచి సేవాయత్ వర్గాలు ఈ మేరకు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని తెలిపారు. ఏ ఒక్క సేవ నిర్వహణలో జాప్యం చోటు చేసుకున్నా, తదుపరి సేవల్లో జాప్యం అనివార్యమై గందరగోళ పరిస్థితి నెలకొంటుందన్నారు. భగవంతుని ఆశీస్సులతో అన్ని శాఖలు, పోలీసు యంత్రాంగం, సేవాయత్ వర్గాల మధ్య చక్కటి సమన్వయంతో రథయాత్ర విజయవంతం కావాలని కోరుకున్నారు. సేవాయత్ వర్గాల సంప్రదింపులతో ఖరారు చేసిన షెడ్యూల్ ప్రకారం పూజలు, సేవాదులు సకాలంలో ముగించడంలో అనుబంధ వర్గాలు బలమైన సమన్వయంతో యాత్ర జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారితో ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా చర్చించారు.



పూరీ బొడొదండొ ప్రాంగణం పరిశీలిస్తున్న ప్రదీప్ కుమార్ జెనా

అగ్గి పుల్లలతో రథాలు

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రథయాత్ర శుభ సందర్భంగా పూరీ కుంభార్‌పడాలో ఉంటున్న 20 ఏళ్ల శాశ్వత రంజన్ సాహు కళాత్మక నైపుణ్యంతో 3 ఆకర్షణీయమైన రథాలను తయారు చేశాడు. వీటిని అగ్గి పుల్లలతో తయారు చేయడం విశేషం. రథయాత్ర ఉత్సవంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ నినాదంతో వీటిని తయారు చేసినట్లు పేర్కొన్నాడు. సమగ్రంగా 2,025 అగ్గిపుల్లలను ఉపయోగించి సూక్ష్మంగా రూపొందించిన బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీజగన్నాథుని రథాల సూక్ష్మ నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. భగవంతుని రథంలో వాస్తవంగా ఉన్న సారథి, చిలుకలు, చక్రాలు, గుర్రాలు మరియు ఇతర కళాఖండాలను కూడా జోడించడం చూడముచ్చటగా ఉంది. ఒక్కో రథం ఎత్తు 6 అంగుళాలు.



దీని తయారీకి దాదాపు 15 రోజులు పట్టిందని ఆయన పేర్కొన్నారు. – భువనేశ్వర్

భగవంతుని సేవ.. మహాభాగ్యం

భువనేశ్వర్: రథయాత్ర సన్నాహాల్లో అన్నివర్గాల ప్రజలు పాత్రధారులే. నింగిని తాకే నిలువెత్తు 3 రథాలకు పట్టు కల్పించి నిలబెట్టడంలో కమ్మరి సేవకుల పాత్ర విభిన్నం. శ్రీమందిరం పరిసరాల డోల మండపం ప్రాంగణంలో కమ్మరి శాల ఏర్పాటు అవుతుంది. దీనిని రథాల రోష శాలగా (వంట గది) పేర్కొంటారు. ఇక్కడ పలు రకాల మేకులు తయారు చేస్తారు. మూడు రథాలకు దాదాపు 50 నుంచి 60 రకాల మేకులు అవసరం కాగా, చిన్న నుంచి పెద్ద వరకు అన్ని రకాల మేకులు రథ రోషశాలలో తయారు చేస్తారు. ఒరొ కొంటా, పొందారి చాబీ, బొళా, జోఖా వంటి అనేక రకాల మేకులు ఈ కమ్మరి వారు తయారు చేస్తారు. ప్రత్యేక శైలిలో వీటిని తయారు చేస్తారు. మేకుల తయారీకి దేవస్థానం ఇనుప కయ్యలు, షీట్లు సరఫరా చేస్తుంది. మూడు వేర్వేరు కొలిమిలు ఏర్పాటు చేసి మేకుల తయారీ చేపడతారు. స్వామి రథం నిర్మాణం ప్రారంభం నుంచి ముగిసే వరకు ఈ సేవకులు ఎంతో దృఢ సంకల్పంతో పని చేస్తూ కనిపిస్తారు. రథాల తయారీలో విశ్వకర్మ, వడ్రంగులు, భొయి కార్మికులు, రూపకారులు, దర్జీలు ఇతరేతర వర్గాల తరహాలో కమ్మరి సేవకుల పాత్ర అనన్యం. స్వల్ప పారితోషికంతో కమ్మరి కార్మికులు భగవంతుని సేవలో ఆనందంతో పని చేస్తారు. మండు వేసవి వాతావరణంలో నిప్పులతో రగిలే కొలిమి శిబిరంలో నిర్విరామంగా శ్రమిస్తున్నారు. భగవంతుని సేవలో నిమగ్నమవ్వడం అదృష్టంగా భావిస్తారు.

ప్రత్యేక ట్రాఫిక్ మొబిలిటీ ప్లాన్

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్ర నిర్వహణకు పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధమైంది. ఈ క్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సునీల్ కుమార్ బన్సాల్ యాత్ర క్షేత్రంలో ఏర్పాట్లు ప్రత్యక్షంగా సమీక్షించారు. రద్దీ నియంత్రణ, రథాలు లాగడం, ట్రాఫిక్ నిర్వహణ, ప్రముఖుల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ వగైరా కార్యకలాపాల దృష్ట్యా పోలీసు దళాలు మోహరిస్తున్నట్లు వివరించారు. 160 నుంచి 170 ప్లాటూన్ల పోలీసు బలగాలను విధుల్లో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. వాహనాల రవాణాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. వాహనాల రవాణా రద్దీ నివారణకు ప్రత్యేక ట్రాఫిక్ మొబిలిటీ ప్లాన్ ఖరారు చేశారు. నగరం లోపల, బయట సమగ్రంగా మూడు భాగాలుగా విభజించి ట్రాఫిక్ మొబిలిటీ నిర్వహిస్తారు. పూరీ పట్టణం 14 జోన్లు మరియు 29 సెక్టార్లుగా విభజించబడింది. ట్రాఫిక్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా అదనపు డైరెక్టర్ జనరల్ అమితాబ్ ఠాకూర్ వ్యవహరిస్తారు.

పలుచోట్ల సీసీటీవీలు

శాంతి భద్రతల నిఘా కోసం యాత్ర ప్రాంగణంలో పలు చోట్ల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. శ్రీమందిరం, గుండిచా మందిరం, బొడొదండొ దారి పొడవునా 50కి పైబడి పలుచోట్ల సీసీటీవీ కెమెరాల్లో నిఘా ఉంటుందన్నారు. రథయాత్ర ముందు రోజు ఆకస్మికంగా రద్దీ పెరిగితే స్థానిక జిల్లా యంత్రాంగం సమన్వయంతో శాంతి భద్రతల పరిరక్షణ చేపట్టేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. రథయాత్ర (శ్రీగుండిచా) నాడు పాహాండి మొదలు కొని రథాలు లాగి గమ్యం చేర్చేంత వరకు శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డీజీపీ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీజీపీ బన్సాల్

బుల్లి నందిఘోష్

జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకుని ఇంజినీరింగ్ విద్యార్థి సృజనాత్మకంగా భక్తిభావం చాటుకున్నాడు. ఐస్‌క్రీం పుల్లలతో ఆకర్షణీయమైన బుల్లి నందిఘోష్ రథం తీర్చిదిద్దాడు. దీనిని శ్రీజగన్నాథుని భక్తులకు అంకితం చేసినట్లు ప్రకటించాడు. 5 రోజులు నిరవధికంగా శ్రమించి 8 అంగుళాల ఎత్తు మరియు 9 అంగుళాల వెడల్పు గల రథం తయారు చేశాడు. దీని తయారీలో మొత్తం 275 ఐస్‌క్రీమ్ పుల్లలను ఉపయోగించాడు. గతేడాది 18 అంగుళాల ఎత్తు, 16 అంగుళాల వెడల్పుతో ఇదే రీతిలో రథాన్ని తయారు చేయడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించాడు. ఈ సంవత్సరం మరింత చిన్న కొలతలతో రథం తయారు చేసి తన రికార్డుని తాను బద్దలుగొట్టడం విశేషంగా పేర్కొన్నాడు. పూరీకి చెందిన సిద్ధ మహావీర్ కుమ్మరి పట్న నివాసి, ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో ఉంటూ ఈ రథం తయారు చేశాడు.



– భువనేశ్వర్

ట్రాఫిక్ వ్యవస్థ కట్టుదిట్టం



వివరాలు వెల్లడిస్తున్న ఏడీజీ అమితాబ్ ఠాకూర్

భువనేశ్వర్: జగన్నాథుని రథయాత్రలో జనసందోహం విపరీతంగా ఉంటుంది. రద్దీ నియంత్రణలో భాగంగా వాహనాల రాకపోకలను కట్టుదిట్టం చేస్తున్నట్లు యాత్ర ట్రాఫిక్ నియంత్రణ ఇన్‌చార్జి అదనపు డైరెక్టర్ జనరల్ అమితాబ్ ఠాకూర్ తెలిపారు. రథయాత్ర పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాల రద్దీ నియంత్రణ కోసం పట్టణాన్ని 3 భాగాలుగా విభజించి ట్రాఫిక్ వ్యవస్థ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో ప్రకటించిన ప్రత్యేక ట్రాఫిక్ మొబిలిటీ ప్లాన్ 19వ తేదీ అర్ధరాత్రి నుంచి అమలవుతుందని ప్రకటించారు. ద్విచక్ర వాహనాల పార్కింగ్ కోసం పట్టణంలో పలుచోట్ల 24 పార్కింగ్ స్థలాలను గుర్తించారు. రాత్రింబవళ్లు 24 గంటల పాటు ట్రాఫిక్ కంట్రోల్ రూం పనిచేస్తుందన్నారు. భువనేశ్వర్ మరియు కోణార్క్ నుంచి వచ్చే వాహనాలు తలొబొణియా వద్ద, గ్రిడ్ స్టేషన్ ఛక్, బ్రహ్మగిరి నుంచి వచ్చే నాలుగు చక్రాల వాహనాలు ఫ్లోరిస్ ఇండియా వద్ద పార్క్ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన అవసరం


పర్లాకిమిడి:

ప్రకృతి వైపరీత్యాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కలెక్టర్ లింగరాజ్ పండా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు శిక్షణ శిబిరం, అధికారుల అప్రమత్తతపై సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తుపాన్లు, వరదలు వచ్చినపుడు ప్రజలను ఎలా కాపాడుకోవాలి, దానికి కావల్సిన వనరులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయం, ఇంటర్‌నెట్ సేవలను వివరించారు. ఒకప్పుడు జిల్లాస్థాయిలో ప్రకృతి వైపరీత్యాలపై తగు సిబ్బంది ఉండేవారని, ప్రస్తుతం సమితి, పంచాయతీ స్థాయిలో సిబ్బంది, స్కూల్స్, ఆహారం, వనరులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం అగ్నిమాపక దళం, ఓడ్రాఫ్ సిబ్బంది అగ్ని ప్రమాదాలు, వరదలు, తుపాన్లు నుంచి ప్రజలను ఎలా రక్షించాలో మాక్ డ్రిల్ ప్రదర్శించారు. సమావేశంలో రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల పర్యవేక్షక డిప్యూటీ డైరెక్టర్ రబినారాయణ బారిక్, ముఖ్య అభివృద్ధి అధికారి, కార్యనిర్వాహణ అధికారి (జిల్లా పరిషత్) రమాంచల్ ఖమారీ, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, అదనపు కలెక్టర్ రాజేంద్ర మింజ్, జిల్లా అత్యవసర అధికారి ప్రభాష్ కుమార్ బెహురా, కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి మేనేజర్ సౌమ్యరాణి గౌడో, సూపరింటెండెంట్ ఇంజినీర్ (రోడ్లు–భవనాలు) శ్రీకాంత్ సామల్, ఎస్డీపీవో రామకృష్ణ పతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నాన్నకు ప్రేమతో...!



ఫాదర్స్ డే పురస్కరించుకొని స్థానిక భేజ్జిపూర్, నీలకంఠ నగర 3వ లైన్‌కి చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ తన కళా నైపుణ్యంతో ఆదివారం వేసిన సైకత శిల్పం ఎంతగానో ఆకట్టుకుంది. సైకత శిల్పంతో ప్రజలను చైతన్యపరిచి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

- బరంపురం

క్లుప్తంగా

సమ్మె విరమణ



సమ్మె విరమించిన ఉద్యోగులు

మల్కన్‌గిరి: జిల్లాలోని అమ్లా సంఘం తరుపున వేతనాలు పెంచాలని కోరుతూ క్లర్క్ ఉద్యోగులు గత 17 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరిస్తామని సీఎం నవీన్ పట్నాయక్ తెలియజేయడంతో, ఉద్యోగులు తమ సమ్మెను ఆదివారం విరమించారు. సోమవారం నుంచి విధులకు హాజరవుతామని సంఘ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్ నాయిక్, లక్ష్మధర్ శేఠిలు తెలియజేశారు.

మరో ప్రయాణికుడు మృతి

- 292కు చేరిన రైలు ప్రమాద మృతుల సంఖ్య

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ స్టేషన్‌లో జరిగిన ఘోర ట్రిపుల్ రైలు ప్రమాదంలో గాయపడిన మరో ప్రయాణికుడు ఆదివారం కన్ను మూశాడు. కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు వైద్య వర్గాలు ప్రకటించాయి. దీంతో ఈ దుర్ఘటన మృతుల సంఖ్య 292కి పెరిగింది. ఎస్‌సీబీ సెంట్రల్ ఐసీయూలో చికిత్స పొందుతు మృతి చెందిన వ్యక్తి పశ్చిమ బెంగాల్‌కు దక్షిణ 24 పరగణాల ప్రాంతానికి చెందిన పల్టు నస్కార్‌గా గుర్తించారు. ఈనెల 2న జరిగిన ఘోర ప్రమాదంలో గాయపడిన పల్టు నస్కార్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రిలో చేర్చారు. అయితే ప్రాణాలు రక్షించడంలో వైద్యుల చికిత్స ఫలప్రదం కాలేదని విచారం వ్యక్తం చేశారు.

పులి సంచారం

- పాదముద్రలు గుర్తించిన అటవీ శాఖ అధికారులు



బంగారువలస సమీపంలో పులి పాదముద్రలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు

మక్కువ: మండలంలోని బంగారువలస గ్రామం సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలో పులి పాదముద్రలను ఆటవీశాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. గతంలో కన్నంపే గ్రామం సమీపంలో పులి సంచరించగా, కొద్ది రోజులు క్రితం కొండరేజేరు గ్రామం సమీపంలోని రెండు ఆవులను బలి తీసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం బంగారువలస గ్రామం సమీపంలో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించడంతో మండల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. బంగారువలస గ్రామం సమీపంలోని ఆయిల్‌పామ్ తోట నుండి, పార్వతీపురం మండలం అడారుగెడ్డ వైపు వెళ్లినట్లు మక్కువ ఫారెస్ట్ ఆఫీసర్ నారాయణరావు తెలిపారు. బంగారువలస, కోన, దబ్బగెడ్డ, సరాయివలస గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.

బొబ్బిలిలో షూటింగ్ సందడి



షూటింగ్‌లో ఓ సన్నివేశం

బొబ్బిలి: సూపర్‌స్టార్ మహేష్‌బాబు మేనల్లుడు గల్లా అశోక్ హీరోగా రూపొందుతున్న ఓ చిత్రం షూటింగ్ బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగింది. హీరో, హీరోయిన్ల మధ్య వచ్చే పలు సన్నివేశాలతో పాటు ఓ ఫైటింగ్ సీన్‌ను కూడా చిత్రీకరించారు. ఈ చిత్రానికి ఇంకా పేరు పెట్టకపోగా, దర్శక, నిర్మాతలుగా జె.అర్జున, ఎస్.బాలకృష్ణ వ్యవహరిస్తున్నారు. హీరోయిన్‌గా మిస్ ఇండియా మానసా వారణాసి నటిస్తున్నారు.

డీసీసీబీలో పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్ష



సీతం ఇంజినీరింగ్ కాలేజీలో ఆన్‌లైన్ పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ)లో వివిధ పోస్టుల భర్తీకి ఆదివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. మేనేజర్ పోస్టులు 6, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు 20, స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులు 32కి ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్ష నిర్వహించారు. మేనేజర్ పోస్టులకు 264 మంది దరఖాస్తు చేసుకోగా 222 మంది పరీక్షకు హాజరు అయ్యారు. 42 మంది గైర్హాజరయ్యారు. అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 737 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 504 మంది హాజరయ్యారు. స్టాఫ్ అసిస్టెంట్ పోస్టులకు 1659 మంది దరఖాస్తు చేసుకోగా 1282 మంది పరీక్షకు హాజరయ్యారు. 377 మంది గైర్హాజయ్యారు.

సీఎం రుణం తీర్చుకునే సమయమొచ్చింది



వేదికపై ఆశీనులైన నాయకులు

- రాష్ట్ర ప్రత్యేకాభివృద్ధి మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి

కొరాపుట్: ఆదివాసీలు సీఎం నవీన్ పట్నాయక్ రుణం తీర్చుకునే సమయమొచ్చిందని రాష్ట్ర ప్రత్యేకాభివృద్ధి మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ జంక్షన్ వద్ద 13 గిరిజన తెగల సంయుక్త సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏరాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక మండలి ఏర్పాటు చేసిన నవీన్ పట్నాయక్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో గిరిజన సాంస్కృతిక భవనం నిర్మిస్తామని వెల్లడించారు. ప్రతీ సమితి కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో గిరిజన భవనాలు నిర్మిస్తామన్నారు. రానున్న పదేళ్లలో గిరిజన తెగలు అభివృద్ధి పథంలో నడిచి ముందుకు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి జగన్నాథ సరక మాట్లాడుతూ.. ప్రత్యేక మండలి ద్వారా గిరిజన తెగల మౌలిక సదుపాయాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 23 జిల్లాల్లో ఇటువంటి మండళ్లు పనిచేస్తాయని తెలియజేశారు.

అంతకుముందు గిరిజన తెగల సంయుక్త మండలి తమ సాంప్రదాయ పద్ధతిలో శిలా ఫలకాలకు పూజలు చేశారు. జిల్లా కేంద్రం సరిహద్దు చమిరియా గుడలో ఉన్న మా చమిరియా దేవతకి పూజలు చేసి భారీ ర్యాలీ ప్రారంభించారు. గోండో జాతి గిరిజనులు తమ సాంప్రదాయ వాయిద్యాలతో ర్యాలీలో ముందుండి నడిపించారు. అనంతర ఒక్కొక్క గిరిజన తెగ ర్యాలీని అనుసరించింది. సమావేశంలో నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్ర, నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానీ, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి, జెడీ్ప అధ్యక్షుడు మెతిరాం నాయక్, కొరాపుట్ ఎస్‌డీసీ చైర్మన్ చంద్రశేఖర్ మజ్జి, రాయగడ ఎస్‌డీసీ చైర్మన్ అనుసూయ మజ్జి, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే మానస్ మడ్కామి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన తెగలు

గోపబంధు దాస్‌కు నివాళులు



బరంపురం: గోపబంధు విగ్రహానికి అంజలి ఘటిస్తున్న నాయకులు



బరంపురం: రక్తదానం చేస్తున్న దృశ్యం



రాయగడ: గోపబంధు దాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: రక్తదానం చేస్తున్న యువకులు

రాయగడ: ఉత్కళ మణి గోపబంధు దాస్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక రైతు కాలనీ సమీపంలో ఉన్న గోపబంధు దాస్ విగ్రహానికి ఏడీఎం సోమనాథ్ ప్రధాన్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన సేవలను కొనియాడారు. రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ పీడీ దయానిధి బాగ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ఒడిశా ఉత్కళమణి గోపబంధు దాస్ వర్ధంతిని సమాజ్ దిన పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించారు. డీపీఆర్వో కార్యాలయ ప్రాగణంలో ఉన్న విగ్రహానికి సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్ ఖేముండు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కోసం గోపబంధు చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన కృషితోనే ఈరోజు ఒడిశా గొప్పగా ఉందని కొనియాడారు. మల్కన్‌గిరి జిల్లా సమాజ్ దిన పత్రిక జిల్లా ప్రతినిధి డి.గోపీకృష్ణ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఐడీఆర్వో అధికారి ప్రమిశా మాఝి పాల్గొన్నారు. అలాగే గోపబంధ్ దాస్ వర్ధంతి సందర్భంగా మల్కన్‌గిరి బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

బరంపురం: నగరంలో ఒడిశా ఉత్కళమణి గోపబంధు దాస్ వర్ధంతి నిర్వహించారు. స్థానిక గిరి రోడ్డు ఉన్న గోపబంధు విగ్రహానికి వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక సమాజ్ దిన పత్రిక కార్యాలయంలో ఆయన విగ్రహానికి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, ఎస్పీ సర్వాణ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి...

ఉపాధి సాయం

వలసలను నివారించి సొంతూళ్లలోనే ఉపాధి కల్పించడం ద్వారా గ్రామాల్లోనే ఎక్కడి వారు అక్కడ ఉండేందుకు చేపట్టిన ఉపాధి హామీ పథకం సత్ఫలితాలే ఇస్తోంది. ఈ పథకంలో చెరువుల అభివృద్ధి వంటి పనులే కాకుండా పండ్ల తోటలు, పూల మొక్కల పెంపకానికి సాయం అందిస్తున్నారు. తద్వారా ఉద్యాన పంటల సాగును పెంచేందుకు పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు. ఈ పథకం కూడా రైతులకు అండగా ఉంటూ ఉపాధి కల్పిస్తోంది.



గంట్యాడ మండలం నీలావతిలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన మామిడి తోట

- మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చు ఇవ్వనున్న ప్రభుత్వం
- ఎకరం పండ్ల తోటల పెంపకానికి రూ.1.04 లక్షల అందజేత
- పూల మొక్కల పెంపకానికీ సాయం
- రెండేళ్ల పాటు నిర్వాహణకు రూ.50 వేల అందజేత
- జిల్లాలో ఇప్పటి వరకు 620 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

విజయనగరం ఫోర్ట్:

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వలసలను నివారించేందుకు ప్రభుత్వం వేతనదారులకు పని కల్పిస్తోంది. సొంత గ్రామాల్లోనే వేతనదారులు పనిచేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వేతనదారులకు ఉపాధి కల్పించడమే కాకుండా పండ్ల తోటలు పెంపకం చేపట్టే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వారికి ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. పండ్ల తోటల పెంపకంతో పాటు పూల మొక్కల పెంపకం చేపట్టే వారికి కూడా ప్రభుత్వం సాయాన్ని అందిస్తుంది. ఉపాధి హామీ పథకం ద్వారా అందించే సాయం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లాలో ఇప్పటికే వందల ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకాన్ని రైతులు చేపట్టారు. ఇంకా ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు.

అర్హతలు

ఉపాధి హామీ పథకం ద్వారా ఆర్థిక సాయం అందాలంటే సన్న, చిన్నకారు రైతులై ఉండాలి. బీసీ వర్గానికి చెందిన వారైతే ఐదెకరాల్లోపు మెట్ట భూమి కలిగి ఉండాలి. అదే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులైతే 10 ఎకరాల్లోపు మెట్ట భూమి ఉండాలి.

సాయం ఇలా...

పండ్ల తోటల పెంపకానికి మూడేళ్ల పాటు మెయింటెనెన్స్ (నిర్వాహణ)కు రూ.1.04 లక్షలు అందిస్తారు. ఎకరానికి 70 మొక్కలు వేసుకోవాల్సి ఉంటుంది. మామిడి, జీడిమామిడి, సపోట, కొబ్బరి తదితర మొక్కలు వేసుకోవచ్చు. ఒక మొక్కకు రూ.45 చొప్పన చెల్లిస్తారు. గుంత తీయడానికి రూ.96, మొక్క వేయడానికి రూ.17 చొప్పన చెల్లిస్తారు. మొక్కకు పాది కట్టడానికి, నీరు పోయడానికి, సంరక్షణకు నెలకు రూ.2200 చొప్పన ఏడాదికి 8 నెలలు పాటు చెల్లిస్తారు. ఈ విధంగా మూడేళ్ల పాటు చెల్లిస్తారు. జిల్లాలో ఇప్పటికే 620 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టారు.

పూల మొక్కలకు అందించే సాయం

పూల మొక్కలకు సంబంధించి గులాబి, మల్లె మొక్కలు పెంపకం చేపట్టుకోవాలి. వీటి పెంపకానికి రెండేళ్ల పాటు మెయింటెనెన్స్ (నిర్వాహణ)కు రూ.50 చెల్లిస్తారు. 25 సెంట్లు భూమిలో 400 మొక్కలు వేసుకోవాలి. మొక్కకు రూ.25 చొప్పున చెల్లిస్తారు. గుంత తీసి, మొక్క వేయడానికి రూ.55 చొప్పన చెల్లిస్తారు. అదేవిధంగా నీరు పెట్టడానికి, కలుపు తీయడానికి సంరక్షణకు నెలకు రూ.2570 చొప్పున చెల్లిస్తారు.

పెరగనున్న ఉద్యాన పంటల విస్తీర్ణం

పండ్ల తోటల పెంపకానికి ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం సాయం అందించడంతో ఉద్యాన పంటల విస్తీర్ణం పెరగనుంది. జిల్లాలో మామిడి 40 వేల హెక్టార్లు, కొబ్బరి 5 వేల హెక్టార్లు, సపోట 6 వేల హెక్టార్లు, జీడి మామిడి 10 వేల హెక్టార్ల వరకు సాగులో ఉన్నాయి.

పనితీరు మార్చుకోండి



మాట్లాడుతున్న ఏడీఎం ప్రధాన్ పక్కనే నాయక్, సాసబొరా

- అధికారులపై మండిపడ్డ ఏడీఎం సోమనాథ్ ప్రధాన్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: ప్రకృతి వైపరీత్యాల నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశాలు జారీచేస్తే అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరికాదని, పనితీరు మార్చుకోవాలని ఏడీఎం సోమనాథ్ ప్రధాన్ సూచించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో ప్రకృతి వైపరీత్యాల నివారణ, తీసుకోవాల్సి జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలు గురించి అత్యవసర సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి అధికారులు హాజరవ్వకుండా, వారి దిగువ స్థాయి అధికారులను పంపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాల్సి ఉన్నప్పటికీ కొంతమంది సమావేశానికి హాజరవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రతీ ఏడాది జూన్ 18వ తేదీన సమావేశం నిర్వహిస్తామని తెలిసినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాల విభాగం రాష్ట్ర శాఖ అధికారి లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ వరదలు, తుపానులు సంభవించక ముందు, అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేస్తుందని అందుకు ఎల్లవేళలా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. పడవలు, ఆహార పదార్థాలు, మందులు, తాగునీరు వంటివి ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఒడ్రాఫ్, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో రాయగడ సబ్ కలెక్టర్ భీమసేన్ సాబొరా, గుణుపూర్ సబ్ కలెక్టర్ లిలిత మోహన్ కుహారా తదితరులు పాల్గొన్నారు.

రథయాత్ర ఏర్పాట్లపై సమీక్ష



రథయాత్ర జరగనున్న స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: పట్టణంలోని బోడోదాండో వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీజగన్నాథ రథాలు నడిచే ప్రధాన మార్గం అందమైన ముగ్గులతో సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. దీంతో కలెక్టర్ లింగరాజ్ పండా, జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌లు రథయాత్ర ఏర్పాట్లపై సమీక్షించారు. జగన్నాథ మందిరం నుంచి గుండిచా వైపు వెళ్లే ప్రధాన మార్గాన్ని మరమ్మతులు చేస్తున్నారు. ఈనెల 19న స్వామివారి నేత్రోత్సవం జరుగుతుంది. అలాగే మూడు రథాలపై సుదర్శన చక్రం కూడా ఆదేరోజు పూజలు జరిపి అమర్చడం జరుగుతుందని రథయాత్ర కమిటీ తెలియజేశారు. 20న జరిగే రథయాత్రకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

బొడ్డవర వద్ద పట్టాలు తప్పిన గూడ్స్

- కొత్త ట్రాక్‌పై ప్రమాదం
- ఎట్టాలు తప్పిన ఆరు వ్యాగన్లు



ట్రాక్ తప్పి కూరుకుపోయిన వ్యాగన్‌లు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర వద్ద గూడ్స్ రైలు ఆదివారం సాయంత్రం పట్టాలు తప్పింది. కిరండూల్ నుంచి విశాఖకు ఐరన్ ఓర్‌తో వస్తున్న గూడ్స్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆరు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ప్రమాద సమయంలో 20 కి.మీ వేగంతో రావాల్సిన రైలు 40 కి.మీ వేగంతో రావడం ప్రమాదానికి కారణం కావచ్చని రైల్వే అధికారులు చెబుతున్నారు. వరుసగా ఉన్న నాలుగు వ్యాగన్లు పట్టాలు తప్పగా మధ్యలో రెండు మినహా తరువాత మరో రెండు వ్యాగన్లు మొత్తంగా ఆరు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఐరన్ ఓర్ సమాంతరంగా వేయకపోవడం ప్రమాదానికి ఒక కారణం కావచ్చని భావిస్తున్నారు. సోమవారం నాటికి ట్రాక్ పునరుద్ధరణ పను లు పూర్తవుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

- ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు
- రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల వారీగా సీట్ల కేటాయింపు
- 6 ప్రభుత్వ, 40 ప్రైవేటు కళాశాలల్లో 16 వేల మందికి అవకాశం



చీపురుపల్లిలోని మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2023 – 24 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఇందుకు మార్గదర్శకాలు రూపకల్పన చేశారు. ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యుల్ ఫర్ డిగ్రీ అడ్మిషన్స్ అనే విధానాన్ని అనుసరించనున్నారు. ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆధీనంలో ఆన్‌లైన్ అడ్మిషన్స్ నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 6 ప్రభుత్వ, 40 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఎంఆర్ సంస్కృత, ప్రభుత్వం డిగ్రీ కళాశాల టౌన్, చీపురుపల్లి, రాజాం, ఎస్‌కోట, గజపతినగరం ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది కొత్త కోర్సులు వచ్చే అవకాశం ఉంది. రెండు రోజుల్లో వాటి వివరాలు తెలుస్తాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పీవీ కృష్ణాజీ తెలిపారు.

షెడ్యూల్ ఇలా...:

నోటిఫికేషన్ విడుదల చేసిన మరుసటి రోజు ఈ నెల 19వ నుంచి 24వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 21 నుంచి 23వ తేదీ వరకు స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్ ఉంటుంది. ఫిజికల్లీ చాలెంజ్/సీఏసీ/ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఏక్టవిటీస్/ఎన్‌సీసీ/గేమ్స్ అండ్ స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరి వెరిఫికేషన్లు విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల, విశాఖపట్టణం డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలలో ప్రాంతాల వారీగా నిర్వహిస్తారు. కళాశాలలు, కోర్సుల ను ఎంచుకోవడం కోసం 26 నుంచి 30వ తేదీ వర కు వెబ్ ఆప్షన్‌కి అవకాశం ఇస్తారు. వచ్చే నెల 7వ తేదీన సీట్ల కేటాయించి, అలాట్ అయిన అభ్యర్థులకు ఎంపిక యిన కళాశాలల్లో 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.

సీట్ల కేటాయింపు ఇలా..

గతంలో డిగ్రీ అడ్మిషన్స్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ వారీగా నిర్వహించేవారు కాదు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డిగ్రీ కోర్సుల్లో 50 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేశారు. ఇంటర్మీడియెట్‌లో కామర్స్ ఒక సబ్జెక్టుగా చదివిన వారికి మొత్తం బీకాం కోర్సులో 60 శాతం సీట్లు కేటాయిస్తారు. అదేవిధంగా ఆర్ట్స్, హ్యూమానిటీస్‌లో ఇంటర్ పూర్తి చేసిన వారికి మొత్తం బీఏ సీట్లలో 50 శాతం సీట్లు కేటాయిస్తారు. తక్కిన 50 శాతం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్ పూర్తి చేసిన వారికి కేటాయిస్తారు.

ప్రత్యేక అడ్మిషన్

స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌లో మూడేళ్ల డిప్లమో ఇన్‌కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ కోర్సు పూర్తి చేసిన వారు బీకాం రెండో సంవత్సరంలో నేరుగా అడ్మిషన్ పొందడానికి అర్హులు. 80 శాతం సీట్లు లోకల్, 15 శాతం సీట్లు నాన్ లోకల్ వారికి కేటాయిస్తారు.

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.1,01,116 వితరణ



విరాళ చెక్‌ను అందజేస్తున్న దాతలు

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో నిత్యాన్నదాన పథకానికి విశాఖపట్నానికి చెందిన కరణం రవిబాబు, డోల లక్ష్మీ దంపతులు రూ.లక్షా వెయ్యి నూట పదహారులను ఆదివారం ఈవో జి.గురునాథంకు అందజేశారు. ఈ మేరకు ఈవో కార్యాలయంలో చెక్ అందించారు. కార్యక్రమంలో వంశధార సూపరింటెండెంట్ ఇంజినీర్ డోల తిరుమలరావు, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు, పూడి కమల తదితరులు పాల్గొన్నారు.

తూర్పుకాపు సంక్షేమ భవనం నిర్మాణమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న తూర్పుకాపు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): తూర్పుకాపుల సంక్షేమ భవనం నిర్మాణమే లక్ష్యంగా అందరూ ఏకతాటిపైకి రావాలని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, తూర్పుకాపు సంక్షేమ సంఘ నాయకులు రాడ కైలాశరావు, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, ఇజ్జాడ శివన్నారాయణమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం తూర్పుకాపు సంక్షేమ సంఘం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలాకాలంగా ప్రతిపాదన స్థాయిలో ఉన్న భవనం నిర్మించేందుకు కలిసికట్టుగా ముందుకుసాగాల్సిన అవసరం ఉందన్నారు. నిధులు సమీకరణ, స్థల పరిశీలన చేసి అందుకు తగినట్లుగా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.వి.స్వరూప్, హారికా ప్రసాద్, లోలుగు కాంతారావు, కద్దాల శ్యామ్, కొమ్మ రమణమూర్తి, ఇప్పిలి శివ, కొండాల గణేష్, వాన కృష్ణచంద్, కరణం శ్రీనివాసరావు, పాండ్రంకి రమేష్, కలిశెట్టి గణపతి, శాసపు జోగినాయుడు, అలుగుబెల్లి నాగభూషణరావు, ఎస్.కె.నాయుడు, లుకలాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ఏ కోర్సులో పది మందికి ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజీలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ప్రవేశాలకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించగా పది మందికి ప్రవేశాలు కల్పించారు. మొత్తం 20 సీట్లు ఉండగా పది మిగిలిపోయాయి. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు కోర్సుకు అర్హులని జిల్లా ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ సంస్థ జాబ్స్ మేనేజర్ రమణమూర్తి తెలిపారు. 100 రోజుల శిక్షణ తరువాత ప్లేస్‌మెంట్ కల్పిస్తామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు 99856 23025 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆధార్ వివరాలను అందించాలి



డీపీటీవో విజయ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: ఏపీ ఎస్‌ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు తాము పనిచేసిన డిపోలో ఆధార్ కార్డు, అనుసంధాన సెల్ నంబరు వివరాలు అందజేయాలని జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని, విశ్రాంత ఉద్యోగికి తెల్ల రేషన్‌కార్డు మంజూరవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

22న ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్, బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ పోస్టులకు ఈ నెల 22న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. వెబ్‌సైట్‌లో పేర్కొన్న అర్హతలు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

చిన్నారులకు పాటల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాటలను చక్కగా ఆలపించారు. బాగా పాడిన ఎల్.నందిని, ఎల్.మాధురి, కె.సుధన్య, శిరీషలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, సాయి ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

కనిపెట్టుకుని ఉండాల్సిందే..!



ఎండ వేడికి ట్యాప్ వాటర్ దగ్గర ఉపశమనం పొందుతున్న పెంపుడు కుక్క.

- ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు అవసరం
- పెంపుడు జంతువులకు అందుబాటులో మంచినీరు ఉంచాలి
- ఉదయం, సాయంత్రం సమయాల్లో పశువులకు మేతకు పంపాలి
- అతిగా మామిడి పళ్లు వద్దని వైద్యుల సూచన



ఎండల ప్రభావంతో చెట్ల నీడను ఆశ్రయించిన మేకలు

టెక్కలి: తీవ్రమైన ఎండల ప్రభావం మనుషులతో పాటు మూగజీవాలపై కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో పెంపుడు జంతువుల సంరక్షణలో మరింత బాధ్యతగా ఉండాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కుక్కలు, కోళ్లు ఇలా పెంపుడు జంతువులు ఎండ ధాటికి గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

- ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు విషయానికి వస్తే ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత వాటిని మేతకు తీసుకువెళ్లాలి.
- పశువులు ఎండల బారిన పడి వడదెబ్బకు గురయ్యే ప్రమాదాలు ఉంటాయి. వడదెబ్బకు గురైన పశువుల్లో నోటి నుంచి సొంగలు, తీవ్రమైన జ్వరంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి సమయంలో తక్షణమే పశు వైద్యులను సంప్రదించాలి.
- ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కావడంతో ఆవులు, గేదెలకు అతిగా మామిడి పళ్లు పెట్టవద్దని వైద్యులు సూచిస్తున్నారు. దీని వల్ల కడుపులో నొప్పితో పాటు మామిడి టెంకలు గొంతుకు అడ్డంగా ఉండిపోతాయి.
- వేసవిలో ఎండు గడ్డి కంటే పచ్చి గడ్డి ఎంతో శ్రేయస్కరం. నిత్యం నీళ్లు అందుబాటులో ఉంచాలి.
- గొర్రెలు, మేకలకు ఆరుబయట గాలి తగిలిన ప్రదేశంలో టార్పాలిన్ల నీడలో ఉంచాలి. కోళ్ల విషయంలో నిత్యం వాటికి నీళ్లు అందుబాటులో ఉంచాలి.
- ఇంట్లో పెంచుకునే కుక్కల విషయంలో మరింత జాగ్రత్తలు పాటించాలి. ఎండ తీవ్రతకు ఒక్కోసారి మెదడు పై ప్రభావం చూపే ప్రమాదాలు ఉన్నాయి. అంతే కాకుండా వేసవిలో మాంసాహారం తక్కువగా ఇవ్వాలి. నిత్యం చల్లటి ప్రదేశంలో ఉంచాలి. అప్పుడప్పుడు చల్లగా ఐస్ నీరు ఇవ్వాలి. సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి.

జాగ్రత్త పడాలి



ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పెంపుడు జంతువులపై ఎండ ప్రభావం లేకుండా సంరక్షణ చేయాలి. ఆవులు, గేదెలు, కోళ్ల సంరక్షణలో జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పెంపుడు కుక్కల విషయంలో మరింత ప్రత్యేక దృష్టి సారించాలి. కొన్ని రకాల పక్షుల కోసం మేడల పైన మంచినీరు ఏర్పాటు చేస్తే ఎంతో మంచిది.
– వి.జయరాజ్, పశు సంవర్ధక శాఖా డీడీ, టెక్కలి.

25న ప్రజాప్రతినిధుల సత్కార సభ



మాట్లాడుతున్న ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసిన నేపథ్యంలో ఆయా ఉద్యోగులంతా ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేయడం మంచి సంప్రదాయమని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. ఈ నెల 25న స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో జరగనున్న సత్కార సభా సన్నాహక సమావేశం శ్రీకాకుళంలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ పలువురు ప్రజాప్రతినిధులను సత్కరించేందుకు కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ తీర్మానించిందని పేర్కొన్నారు. కొన్నేళ్లుగా తమను రెగ్యులర్ చేయాలంటూ కాంట్రాక్టు ఉద్యోగుల పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందన్నారు. మిగిలిన కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ అయ్యేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రజాప్రతినిధులను ఈ నెల 25న సత్కరిస్తామని చెప్పారు. కమిటీలు వేసుకుని కార్యక్రమం విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు. సమావేశంలో కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

ఎండలకు బండి దగ్ధం



బైక్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో తీవ్రమైన ఎండ ధాటికి ఆదివారం ఉదయం 11.10 గంటల ప్రాంతంలో ఓ బైక్ కాలిపోయింది. శ్రీకాకుళం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మెన్ బి.శృంగార నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా గుర్ల వాసి బెవర శ్రీనివాసరావు తన భార్యతో కలిసి అరసవల్లి, శ్రీకూర్మం, రాజులమ్మ తల్లి దర్శనానికి ఆదివారం వచ్చారు. తిరిగి వెళ్తున్న క్రమంలో బండి నుంచి కాలిన వాసన రావడంతో అప్రమత్తమై బండి దిగి చూసేసరికి బ్యాటరీ వద్ద నిప్పు కనిపించింది. కొన్ని క్షణాల్లోనే ఆయిల్ ట్యాంక్ పైన మంటలు చెలరేగాయి. వెంటనే పక్కనే ఉన్న దుకాణాల సముదాయాల వారు నీళ్లు చల్లి, గోనెసంచితో మంటలను ఆర్పారు. ఈలోగా అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ప్రమాద తీరును, ద్విచక్రవాహనాన్ని పరిశీలించి మంటలను పూర్తిగా అదుపు చేశారు. వాహనంలో తక్కువ ఇంధనం ఉండటంతో ప్రమాదం తప్పిందని అంతా భావించారు.

వానల కోసం వరుణ యాగం



10వవార్డులో జరుగుతున్న వరుణ యాగం

కాశీబుగ్గ: మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కలగడానికి వానలు కురవాలని కోరుతూ పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో వార్డు కౌన్సిలర్ శర్వాన గీతారవి ఆధ్వర్యంలో వరుణ యాగం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున బిందెలతో నీళ్లు తీసుకువచ్చి శివుడిని అభిషేకించారు.

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



ఉన్నతాధికారులకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో హరిసూర్యప్రకాష్



ట్రస్ట్ బోర్డు సభ్యుడు మండవల్లి రవిని ఆశీర్వదిస్తున్న శంకరశర్మ

అరసవల్లి: ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు ఆదిత్యుని దర్శనానికి బారులు తీరారు. ఆదివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈవో వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక, ఉచిత, విశిష్ట దర్శనానికి వచ్చే మార్గాల్లో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి ప్యాకెట్లను అందుబాటులో ఉంచడంతో దాహార్తి ఇబ్బందులు తలెత్తలేదు. ఆలయం బయట భారీగా షెడ్లు వేయడంతో ఎండ నుంచి ఉపశమనం దక్కింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,29,200, విరాళాల ద్వారా రూ.44,693, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు ఈఓ వివరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారులు..

సెంట్రల్ మైన్స్ జాయింట్ డైరక్టర్ కెంబూరు ఇందూధరరావు, ఏపీ స్టేట్ ఫైనాన్స్ నోడల్ ఆఫీసర్ ప్రియాంక నషీనే ఆదివారం ఉదయం ఆదిత్యున్ని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

గ్రామీణాభివృద్ధిలో కీలకపాత్ర ఇంజినీర్లదే

- గత ప్రభుత్వ అవినీతి అక్రమాల్లో ఇంజినీర్లను బాధ్యులు చేయొద్దు
- పీఆర్ డిప్లమో ఇంజినీర్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు రవీంద్ర



రాష్ట్ర సంఘ అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తున్న మహంతి తదితరులు

అరసవల్లి: ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ హయాంలో జరుగుతున్న గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పంచాయతీరాజ్ ఇంజినీర్లదేనని.. పాలక ప్రభుత్వ నిర్ణయాల మేరకు మాత్రమే తాము చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్న సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలని పీఆర్ డిప్లమో ఇంజినీర్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కె.రవీంద్ర స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన జిల్లా సంఘ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దల ఆదేశాలు, ఉన్నతాధికారుల సూచనల మేరకు మాత్రమే ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్నారని స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖలో జరిగిన అవినీతి అక్రమాల్లో తమను బాధ్యులు చేయడం తగదన్నారు. గత ప్రభుత్వ అవినీతి అక్రమాలపై విజిలెన్స్ ఇచ్చిన నివేదికల మేరకు పీఆర్ ఇంజినీర్లపై చర్యలకు దిగరాదని కోరారు. అంతకు ముందు జిల్లా పీఆర్ డిప్లమో ఇంజినీర్ల సంఘ అధ్యక్షుడు కేసీహెచ్ మహంతి ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న కార్యక్రమాలు, సంఘం తరపున నివేదికలు వివరించారు. పీఆర్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న టి.ఎ, జె.టి.ఓ, ఏఈ, పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మహంతి కోరారు. రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి బి.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగుల సంక్షేమం చేపట్టాలన్నారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కేసీహెచ్.మహంతి, ఎస్‌వీఏ.పోలినాయుడు, అడ్వైజర్ పల్లె నర్సింహులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చంద్రునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణారావు, ఎస్.సత్యనారాయణ, పి.నిత్యానందం, కె.గౌరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని బంధం

- లారీ ఢీకొని భార్యాభర్తలు మృతి
- శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఘటన
- బాడాంలో విషాదఛాయలు



మృతిచెందిన త్రిమూర్తులు, నాగమణి(ఫైల్)

కోటబొమ్మాళి/నరసన్నపేట: శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో భార్యాభర్తలు మృతి చెందారు. ఈ విషాద ఘటన కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేట వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేట మండలం బాడాం గ్రామానికి చెందిన బమ్మిడి త్రిమూర్తులు(45), నాగలక్ష్మి(40) దంపతులు శనివారం కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేటలో జరిగిన శుభకార్యానికి వచ్చారు. భోజనాల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో స్వగ్రామానికి వెళ్లేందుకు సుబ్బారావుపేట జంక్షన్‌లో జాతీయ రహదారి వద్దకు చేరుకుని బస్సు కోసం వేచిచూస్తున్నారు. ఇంతలో టెక్కలి వైపు నుంచి అతివేగంగా వస్తున్న లారీ వీరిద్దరినీ ఢీకొట్టింది. ఈ ఘటనలో త్రిమూర్తులు అక్కడికక్కడే మృతిచెందగా, కొనఊపిరితో ఉన్న నాగలక్ష్మిని 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. వీరికి ముగ్గురు కుమారులు మురళీ, మణి, లక్ష్మణ ఉన్నారు. అందరూ చదువుతున్నారు. పెద్దకుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. త్రిమూర్తులు, నాగమణి దంపతులు పేద కుటుంబానికి చెందిన వారు. రోడ్డు ప్రమాదంలో ఒకేసారి మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది. దంపతుల మృతి పట్ల సర్పంచ్ డోల గోవిందరావు సంతాపం వ్యక్తం చేశారు.

వాహనం ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

- మూడు గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా



ముత్యాలపేటరోడ్డులో స్తంభాలను మార్చుతున్న విద్యుత్ సిబ్బంది

కవిటి: మండలంలోని ముత్యాలపేట, కపాసుకుద్ది వెళ్లే మార్గంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు విరిగి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇసుకను లబ్ధిదారులకు అందిస్తున్న క్రమంలో అర్ధరాత్రివేళ ఈ మార్గంలో భారీగా వాహనాల రాకపోకలు కొన్నాళ్లుగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి అతివేగంతో వచ్చిన వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో వెంటనే సరఫరా నిలిచిపోయింది. దీంతో ముత్యాలపేట, కె.కపాసుకుద్ది, సీహెచ్‌కపాసుకుద్ది గ్రామాలకు సుమారు 30 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎట్టకేలకు ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించగలిగారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రాంబుడ్డి కామేష్(ఫైల్)

సోంపేట: మండలంలోని కొర్లాం పంచాయతీ శాంతినగర్‌కు చెందిన రాంబుడ్డి కామేష్ (34) ఆదివారం తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. బారువ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేష్ తన భార్య స్వప్నతో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట స్వప్న బారువలోని కన్నవారింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన కామేష్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి కుమార్తె రేష్మ, కుమారుడు దినేష్ ఉన్నారు. కామేష్ తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

జూడో పోటీల్లో నితిన్‌కు కాంస్యం



నితిన్‌ను అభినందిస్తున్న జూడో ఫెడరేషన్ సంఘం సభ్యులు

పొందూరు: తిరుపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ క్యాడెట్ జూడో పోటీల్లో పొందూరు మండలం తాడివలస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కొత్తకోట నితిన్ కాంస్య పతకం సాధించాడని ప్రధానోపాధ్యాయుడు బల్ల కంటయ్య, పీఈటీ ధవళ తెలిపారు. నితిన్ ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. విద్యార్థి కాంస్య పతకం సాధించడం పట్ల జిల్లా సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి పైడి సునీత, జిల్లా జూడో కోచ్ మణికుమార్, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్ ఉమేష్‌కుమార్ సింగ్, ఏపీ జూడో సంఘం అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం



తోటల్లో ఉన్న ఆలయం వద్ద సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: రాజాం పరిసర జీడి తోటల్లో ఎలుగు సంచరించడంతో ఉద్దాన ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తోటలో ఉన్న అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించేందుకు ఎలుగు ఆదివారం ప్రయత్నించింది. తాళం వేసి ఉండటంతో ఆలయం చుట్టూ తిరుగుతూ స్థానికుల కంట పడింది. వారు కేకలు వేయడంతో భల్లూకం కాశీబుగ్గ రోడ్డు వైపు జారుకుంది. పనస, మునగ తోటలకు రైతులు వెళ్తున్న కాలంలో ఎలుగు సంచరిస్తుండడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

ఉత్సాహంగా పెన్‌కాక్ సిలాట్ ఎంపిక పోటీలు



ఎంపికల్లో క్రీడాకారుల ప్రతిభా విన్యాసాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా పెన్‌కాక్ సిలాట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రాండ్ మాస్టర్ ఆర్.దయామయ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఈ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 75 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతి భను నిరూపించుకున్నారు. రాష్ట్ర పోటీలకు 18 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీల్లో చిత్తూరు జిల్లా రేణిగుంట వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. జిల్లా పెన్‌కాన్ సిలాట్ కార్యదర్శి నక్క లక్ష్మన్నాయుడు, కోచ్ యశ్వంత్‌లు ఎంపికలను నిర్వహించారు. పోటీలకు శ్రీకాకుళం రూరల్ నుండి చిట్టి సూర్యనారాయణ, అలికాన రాము, చంద్రశేఖర్ మాస్టర్లు, రణస్థలం, లావేరు నుంచి ఈశ్వరరావు గార నుంచి శివరాం మాస్టర్లు వచ్చారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

అరసవల్లి: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఏఎస్పీ విఠలేశ్వరరావు అన్నారు. అరసవల్లిలో ఆదిత్య ఆర్చరీ అకాడమీలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువిద్య (ఆర్చరీ) చాలా గొప్ప క్రీడ అని...విద్యార్థి దశ నుంచే ఇలాంటి క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందవచ్చునన్నారు. కాగా, అండర్ -9 విభాగంలో జి.విజయ్, సీహెచ్.భవానీప్రసాద్ తేజ, సీహెచ్.నిహాల్ రామ్‌తేజ, అండర్-14 విభాగంలో ఎ.కళ్యాణ్, ఓ.మేఘన, జె.సాయి సాహిల్, అండర్ -16 విభాగంలో కె.నీల మనోహర్‌నాయుడు, పి.త్రివేణి, జి.తనీషా చౌదరిలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి. కార్యక్రమంలో ఆదిత్య ఆర్చరీ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్, జిల్లా ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.చిట్టిబాబు, శిక్షకులు మధుసూదనరావు, ఈశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.